بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadzrat Khalifatul Masih V 26.06.2020 (Telugu)**

# ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి వైభవోపేతమైన అనుచరులు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ రజి మరియు హజ్రత్ సఅద్ బిన్ మఅజ్ రజి గార్ల విశిష్టతల ప్రస్తావన.

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 26. 06.2020 తేదీన - మస్జిద్ ముబారక్, ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

**అష్‌హదు అన్ లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు లా షరీక లహు వ అష్‌హదు అన్న ముహమ్మదన్ అబ్‌దుహు వ రసూలుహు. అమ్మా బఅదు ఫఅవూజ్ బిల్లాహి మినష్షైతా నిర్రజీమ్- బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం- అల్ హందు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్ - అర్రహ్మా నిర్రహీం -మాలికి యౌమిద్దీన్- ఇయ్యాక నఅబుదు వ ఇయ్యాక నస్తయీన్- ఇహ్‌దినస్సిరాతల్ ముస్తఖీమ- సిరాతల్లజీన అన్ అమ్‌త అలైహిం ఘైరిల్ మఘ్‌జూబి అలైహిం వలా జ్జాల్లీన్.**

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనా నంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి:

గత ఖుత్బాలో కూడ హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ గురించి ప్రస్తావించబడెను. మిగిలిన మరి కొంత భాగమును నేడు ప్రస్తావించుచున్నాను. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ దాతృత్వము ప్రసిద్ధి చెందినది. వారు చాలా ఆర్థిక త్యాగములు చాలా చేశారు. బదర్ యుద్ధములో పాల్గొన్న ప్రతి ఒక్కరికి నాలుగు వందల దీనార్లు తన తదనంతరం తన ఆస్తిలో నుండి ఇవ్వవలెనని హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ వసియ్యత్ చేసినట్లు ఒక కథనములో పేర్కొనబడెను. కావున ఆ వాంగ్మూలము మేరకు వారిలో పంచబడింది. . అప్పటికి ఆయా అనుచరులు వంద మంది వరకు ఉన్నారు. తబూక్ యుద్ధము సన్నాహాల కొరకు అల్లాహ్ మార్గములో ధనము, ప్రయాణ సాధనాలను అందించవలెనని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులకు, ధనికులకు పిలుపునిచ్చారు. అప్పుడు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ వంద ఓఖియాలను సమర్పించిరి. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ , అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ భూమండలంపై అల్లాహ్ తాలా నిధులలో రెండు నిధులు అని, వారు అల్లాహ్ ప్రీతి కొరకే ఖర్చు చేస్తారని కొనియాడారు.

హజ్రత్ ఉస్మాన్ నుండి ఒక భూమిని నలభై వేల దీనార్లకు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ కొనుగోలు చేశారు. ఆపై దానిని బనూ జుహ్‌రహ్‌లోని పేదలు, నిరాశ్రయులకు, విశ్వాసుల తల్లులకు పంచి పెట్టారు. ముసవ్విర్ బిన్ మఖ్‌జిమహ్ ఇట్లు ఉల్లేఖించారు. నేను హజ్రత్ ఆయిషా రజియల్లాహు తఆలా అన్హాకు ఆ భూమిలో నుండి కొంత భాగమును బహుకరించగా దీనిని ఎవరు పంపారని హజ్రత్ ఆయిషా అడిగి తెలుసుకొనిరి. అందుకు నేను అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ అని సమాధానిమిచ్చాను. అప్పుడు నా తరువాత ఎవరైతే ఎక్కువ సహనంను పాటించెదరో వారే మీ పట్ల ఉత్తమముగా వ్యవహరించుదురని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పినట్లుగా హజ్రత్ ఆయిషా రజియల్లాహు తఆలా అన్హా వినిపించారు. అనంతరం ఓ అల్లాహ్! అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌కు స్వర్గములోని సల్‌సబీల్ చెలిమలోని పాయసంను త్రాగించుము అని దుఆ చేశారు.

మరొక కథనములో ఈ విధముగా గలదు. నా తర్వాత నా కుటుంబ సభ్యుల యోగక్షేమాలను సత్యవంతులైన. సజ్జనులు మాత్రమే చూసుకొందురని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెల్పినట్లు గలదు. కావున అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ విశ్వాసుల తల్లులకు వాహనములు సమకూర్చేవారు. వారికి హజ్ చేయించేవారు. వారి పల్లకిలపై పరదాలు వేయించేవారు. వారు పరదాలో వుంటూ, స్వతంత్రంగా విడిది చేసుకొనుటకు నిర్మానుష్యంగా వున్నటువంటి లోయలను వారి కొరకు ఎంపిక చేసేవారు.

ఒకసారి మదీనాలో ఆహార పదార్థాల కొరత ఏర్పడింది. ఆ సమయంలోనే సీరియా నుండి ఏడు వందల ఒంటెలపై గోదమ పిండి, ఆహార పదార్థాలతో కూడిన సామాగ్రితో కూడిన ఒక బృందం మదీనాకు చేరుకుంది. ఫలితముగా మదీనాలో నలువైపుల ఉరుకులు పరుగులు మొదలైనాయి. ఈ ఉరుకులు పరుగులు ఏమిటి? అని హజ్రత్ ఆయిషా అడిగితెలుసుకొనిరి. అందుకు హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ వద్దకు ఏడు వందల ఒంటెలతో కూడిన ఒక వ్యాపార బృందము వచ్చినది. వాటిపై గోధుమ పిండి, ఇతర ఆహార సామాగ్రీలు ఉన్నాయి అని విన్నవించుకున్నారు. అప్పుడు విశ్వాసులకు తల్లి అయినా హజ్రత్ ఆయిషా గారు అబ్దుర్రహ్మాన్ మోకాళ్లపై నడుస్తు స్వర్గములో ప్రవేశించును అని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి అలైహి

వసల్లం తెల్పుచుండగా నేను విన్నాను అని తెల్పినారు. ఈ విషయం హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ గారికి తెలియగానే వారు హజ్రత్ ఆయిషా వద్దకు చేరుకొని, ఓ అమ్మా! నేను మిమ్ములను సాక్షిగా నిలుపుతూ, ఈ ధాన్యమును, ఆహార పదార్థాలను, సంచులను, ఒంటెలపై కట్టిన తాళ్లను కూడ దైవ మార్గములో ఖర్చు చేస్తున్నాను. తద్వారా నేను నడుచుకుంటూ స్వర్గములోకి ప్రవేశించాలని భావిస్తున్నట్లుగా విన్నవించుకొనిరి.

అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ దైవ మార్గములో చాలా ఖర్చు చేసేవారు. ఒక్కొక్కసారి వీరు ఒక్క రోజులోనే ముప్పై ముప్పై బానిసలకు స్వతంత్రము కల్పించేవారు.

ఒక సారి వారు తమ ధనములోని అర్థ భాగము అనగా నాలుగు వేల దిర్హమ్‌లను అల్లాహ్ మార్గములో ఖర్చు చేసినారు. మరొకసారి నలభై వేల దిర్హమ్‌లు, మరొసారి మరో నలభై వేల దిర్హమ్‌లు అల్లాహ్ మార్గములో ఖర్చు చేసినారు. ఒక సారి ఐదు వందల గుర్రాలను దైవ మార్గములో సమర్పించుకొనిరి. మరొకసారి ఐదు వందల ఒంటెలను దైవ మార్గములో ఇచ్చివేసిరి. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ కుమారుడు అబూసల్మా ఇట్లు ఉల్లేఖించారు. మా తండ్రి విశ్వాసుల తల్లుల కొరకు ఒక తోటను కేటాయిస్తూ మరణ వాంగ్మూలము నిచ్చారు. ఆ తోట నాలుగు లక్షల దిర్హమ్‌ల విలువ చేయుచుండెను. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ 50 వేల దీనార్లను దైవ మార్గములో దానము చేయాలని వాంగ్మాలము నిచ్చారు. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ 31వ హిజ్రి సంవత్సరములో మరి కొందరి దృష్టిలో 32వ హిజ్రి సంవత్సరములో మృతి చెందారని చెప్పుకుంటారు. 72 సం॥ల జీవితాన్ని పొందారు. మరి కొందరు 78 సం॥లు జీవించారని, బఖీ స్వర్గములో సమాధి చేయబడ్డారని పేర్కొన్నారు. హజ్రత్ ఉస్మాన్ వారి అంత్యక్రియ ప్రార్థన చదువించారు. ఒక కథనము ప్రకారము హజ్రత్ జుబైర్ బిన్ అవామ్ అంత్యక్రియ ప్రార్థన చదివించారు.

ప్రస్తావించబడుచున్న మరొక అనుచరుడి పేరు హజ్రత్ సాద్ బిన్ మఆజ్. హజ్రత్ సాద్ బిన్ మఆజ్ అన్సార్‌లోని ఔస్ తెగకు చెందిన బనూ అబ్దుల్ అష్‌హల్‌కు చెందిన వారు. వారు ఔస్ తెగకు నాయకునిగా ఉండేవారు. హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ ద్వారా హజ్రత్ సాద్ బిన్ మఆజ్, హజ్రత్ హుసేన్ బిన్ ఉజైర్ ఇస్లాం స్వీకరించారు. అఖ్బ సానియాలో పాల్గొన్న 70 మంది అనుచరులు రాక ముందే హజ్రత్ ముస్అబ్ బిన్ ఉమైర్ మదీనాకు చేరుకొనిరి. వారు మదీనాకు పంపబడిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశము ప్రకారము వారు ప్రజలకు ఇస్లాం సందేశము అందించేవారు. వారికి పవిత్ర ఖుర్‌ఆన్ వినిపించేవారు. హజ్రత్ సాద్ బిన్ మఆజ్ ఇస్లాం స్వీకరించినప్పుడు బనూ అబ్దుల్ అష్‌హల్‌తో ఇట్లనిరి. ఓ బని అబ్దుల్ అష్‌అల్ ! మీరు నన్ను ఏ విధముగా భావిస్తున్నారు?. అందుకు తెగ వారందరు ముక్త కంఠముతో మీరు మా నాయకులు, నాయకుల కుమారుడైన నాయకుడివి. మీ విషయంలో మాకు పూర్తి నమ్మకం గలదు అని సమాధాన మిచ్చారు. అప్పుడు సఅద్ మరల వారితో మీరు అల్లాహ్ మరియు అతని ప్రవక్తను విశ్వసించనంత వరకు మీకు నాతో ఎలాంటి సంబంధము లేదు అని తెలిపెను. ఆ తరువాత ప్రచార కార్యక్రమము కూడ ప్రారంభించెను. ఆ తరువాత వారికి సఅద్ ఇస్లాం యొక్క విధి విధానాలను తెలియజేయడం జరిగింది. అనగా తమ తెగ వారికి ఇస్లాం విధి విధానాలను గూర్చి, ఇస్లాం బోధనలను గూర్చి తెలియజేయడం జరిగింది. అలా ఆరోజు సాయంత్రం కాకముందే అనగా ఇంకా చీకటి పడక ముందే , సాయంత్రం కన్న ముందే ఆ తెగవారందరు ఇస్లాంను స్వీకరించారు. అలా సఅద్ మరియు ఉసయ్యద్ ఇరువురు కలసి తమ తెగలో ఉన్నటు వంటి విగ్రహాలన్నింటిని తీసి పడేశారు.

ఆ రోజు ముసల్మానులైన సఅద్ బిన్ ముఆజ్ మరియు ఉసయ్యద్ బిన్ హుజైర్‌లు ఇరువురు అత్యుత్తమ అనుచరులుగా గుర్తించబడేవారు. అన్సార్‌లలో నిస్సందేహముగా వారికి ఒక ప్రత్యేక స్థానము ఏర్పడింది. వారు గొప్ప స్థాయిని కల్గి ఉన్నారనుటలో ఎలాంటి సంకోచము లేదు. ప్రత్యేకించి మక్కా నుండి ప్రస్థానం చేసి వచ్చిన అనుచరులలో హజ్రత్ అబూబకర్‌కు ఉన్నటు వంటి స్థానము సఅద్ బిన్ మఆజ్‌కు అన్సార్‌లలో గలదు. ఈ నవయువకుడు చాలా స్వచ్ఛత గలవాడు. ఎంతో విధేయుడు. ఇస్లాం మరియు ఇస్లాం స్థాపకుల విషయంలో ప్రాణాలు అర్పించు స్థాయికి చేరుకున్నాడు. పైగా అతడు తన తెగలోనే నాయకులందరికి ముఖ్య నాయకుడు, ఎంతో చురుకైనవాడు. ఇస్లాంలో వారికి కేవలం కొందరు ప్రత్యేక అనుచరులకు మాత్రమే లభించునట్టి ఒక గొప్ప స్థానము వారికి లభించినది. అంతగొప్ప అనుచరుడు నిండు యవ్వనంలో మృతి చెందినప్పుడు, అతని మరణం వలన నిస్సందేహముగా ఆకాశంలో ఉన్నటువంటి కరుణామయుడి సింహాసనమే చలించిందని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపారు. వారు ఒక గొప్ప నిదర్శనమునకు సాక్ష్యం.

ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు చేరుకొని చాలా రోజులు గడవక ముందే మీరు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కు ఇచ్చినటు వంటి అభయంను తిరిగి వెనుకకు తీసుకోండి. లేనిచో మీకు మంచి జరుగదు అని

ఖజ్‌రజ్ తెగకు చెందిన నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ ఉబై బిన్ సులూల్‌కు మరియు అతని మిత్రుల పేరుతో మక్కాకు చెందిన ఖురైష్‌ల నుండి ఒక హెచ్చరికతో కూడిన లేఖ రావడం జరిగింది. మదీనాలో ఈ లేఖ చేరగానే ముందు నుండే ఇస్లాం పట్ల ద్వేషానురాగాలను మరియు ఇస్లాం మరియు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల వారి మనస్సులో ఈర్ష్యను పెంచుకుంటున్న మనస్థత్వం గల అబ్దుల్లాహ్ బిన్ ఉబై బిన్ సులూల్ మరియు అతని మిత్రులు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో యుద్ధం చేయుటకు సన్నహాలు ప్రారంభించారు. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ఈ విషయం తెలియగానే వెంటనే వారిని కలిసారు. ఆపై మీరు నాతో యుద్ధం చేసినచో అది మీకే నష్టమును కల్గించునని, ఎందుకనగా మీరు మీ సోదరులతో, మిత్రులతోనే పోరాడవలసి వస్తుందని హుజూర్ (స) వారికి నచ్చజెప్పారు. ఫలితముగా వారు తమ సంకల్పాన్ని విరమించుకున్నారు. అలా ఖురైష్‌ల ఎత్తుగడ నిర్వీర్యమైనందున వారు కొంత కాలం తరువాత ఇలాంటి హెచ్చరికతో కూడిన మరోక లేఖను మదీనాలో ఉన్నటు వంటి యూదులకు కూడ వ్రాసారు. మొత్తానికి మక్కాకు చెందిన ఖురైష్‌ల ఆ లేఖ, వారి తాత్కాలిక ద్వేషపూరితమైనది కాదు. అది ముసల్మానులను శాశ్వతముగా శాంతియుతముగా ఉండకుండా చేయుటకు నిర్ణయించుకున్నటు వంటి ఒక కుట్ర, ఇస్లాంను ప్రపంచములోనే లేకుండా చేయాలని పాల్పడుచున్నటు వంటి ఒక కుట్ర.

ఒక చారీత్రాత్మక ఘటన మక్కావారి రక్త పిపాసపు ఉత్సాహాన్ని తెలియజేస్తుంది. ఆ ఘటన ఇలా గలదు. దీనిని బుఖారి షరీఫ్ కథనము కూడ బలపరుస్తుంది. సఅద్ బిన్ ముఆజ్ ఉమ్రా చేయాలనే ఉద్దేశంతో మక్కాకు వెళ్ళారు. కాని దైవికముగా ఆ సమయంలోనే అబూ జహల్ కూడ అక్కడికి చేరుకున్నాడు. అతని చూపు సఅద్‌పై పడగానే అబూ జహల్ కన్నులలో రక్తం తిరుగసాగింది. కాని తన కోపాన్ని అణుచుకొని ఉమయ్యతో ఓ అబూ సుఫ్యాన్! నీతో పాటు ఉన్నటు వంటి ఈ వ్యక్తి ఎవరు? అని ప్రశ్నించెను. అందుకు ఉమయ్య వీరు ఔస్ తెగ నాయకులైన సఅద్ బిన్ ముఆజ్ అని తెల్పినారు. అందుకు అబూ జహల్ ఎంతో కోపంతో సఅద్‌తో ఇలా అన్నాడు: మీరు (నవూజ్‌బిల్లాహ్) మా ధర్మంను వీడిన ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ఆశ్రయం కల్పించి శాంతియుత వాతవరణంలో మక్కాలో ఖాన కాబాప్రదక్షణలు చేయగలరా?, పైగా మీరు ఆ వ్యక్తికి అనగా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు రక్షణ కల్పిస్తామని మరియు సహాయ సహకారములు అందిస్తామని భావించుచున్నారా?. దేవుని ప్రమాణంగా తెల్పుచున్నా ఒకవేళ అబూ సుఫ్యాన్ నీతో లేనిచో నీవు మా నుండి తప్పించుకొని క్షేమముగా తిరిగి నీ కుటుంబ సభ్యుల వద్దకు చేరుకోగలవా? అని హెచ్చరించసాగెను. అందుకు సఅద్ బిన్ ముఆజ్ ఎంతో గాంభీరముగా దేవుని ప్రమాణం! ఒకవేళ నీవు మమ్ములను కాబా ప్రదక్షణల నుండి అడ్డుకున్నచో మేము కూడ మిమ్ములను మీ సిరియా ప్రయాణ మార్గంలో మిమ్ము అడ్డుకుంటాము. మేము కూడ ఆ మార్గములో కూర్చొని మీకు వ్యతిరేకముగా అనేక రకాల చర్యలు చేపట్టి మీకు కూడ శాంతి లేకుండా చేయుదుము అని సఅద్ కూడ అంతే ధీటుగా సమాధానము ఇచ్చారు.

హజ్రత్ సఅద్ బిన్ ముఆజ్ బదర్, ఉహద్ మరియు ఖందఖ్ యుద్ధాలలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలసి పాల్గొన్నారు. బదర్ యుద్ధం రోజు ఔస్ తెగకు చెందిన పతాకము సఅద్ బిన్ ముఆజ్ చేతిలోనే ఉండెను. బదర్ యుద్ధ సమయంలో సఅద్ బిన్ ముఆజ్ ప్రదర్శించిన ఉత్సాహం, ఉద్రేకం, ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల వారికి ఉన్నటు వంటి అభిమానం మరియు అంకిత భావములు వారు బదర్ యుద్ధంలో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు ఇచ్చిన సలహా ద్వారా తెలుస్తుంది.

ముసల్మానులు ప్రయాణిస్తూ బదర్ నుండి కొద్ది దూరంలోనే ఉన్నటు వంటి జఫ్రాన్ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడికి చేరుకున్న కొద్ది సేపటికే తమ వ్యాపార బృందాన్ని కాపాడుకోవడానికి మక్కా నుండి ఒక పెద్ద సైన్యం వస్తున్న విషయం రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంకు తెలిసింది. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులందరిని సమూహపర్చి సైన్యంను గూర్చిన సమాచారాన్ని తెలియజేశారు. ఆపై ఈ సమయంలో ఏం చేద్దాం అని వారిని సలహా అడిగారు. కొందరు అనుచరులు మాత్రం ఓ రసూలుల్లాహ్! మన వద్ద ఉన్నటు వంటి సామాగ్రిని చూసుకున్నచో మనం వ్యాపార బృందాన్ని అడ్డుకోవడమే సమంజసం అని అర్థమవుతుంది. ఎందుకగా సైన్యంతో ఎదుర్కొనుటకు మనం ఇంకా పూర్తి స్థాయిలో సిద్ధము కాలేదు అని సహాలు ఇచ్చారు. కాని హుజూర్ (స) ఆ సలహాను తిరస్కరించారు. మరోవైపు ఉన్నతులైన అనుచరులు ఈ అభిప్రాయమును విన్న తరువాత ప్రాణ త్యాగాలు చేయుటకై ఉపన్యాసాలు చేయడం ప్రారంభించారు. ఆపై మా ప్రాణాలు, ధనము అన్ని దైవ మార్గంలో అర్పించెదము. మేము అన్ని రంగాలలో అన్ని విధాల సేవలకు సిద్ధముగా ఉన్నాము. ఈ క్రమంలోనే మిఖ్దాద్ బిన్ అస్వద్ వారి మరొక పేరు మిఖ్దాద్ బిన్ అమ్రూ. వారిట్లనిరి. ఓ రసూలుల్లాహ్!

మేము మూసా అనుచరుల వలే “వెళ్ళుము! నీవు మరియు నీ దేవుడు కలసి యుద్ధం చేయండి, మేము ఇక్కడే కూర్చొని ఉంటాము ”అని సమాధానం ఇవ్వము. మీరు మమ్ము మీకు నచ్చిన ప్రతి చోటికి  తీసుక వెళ్ళండి, మేము మీతో పాటు ఉంటాము. మేము మీ ముందు, మీ వెనకాల, మీ ఎడమ, మీ కుడి వైపులో పోరాడుతాము. వారి ఈ ఉపన్యాసం విన్న తరువాత రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ముఖము ఆనందంతో కళకళలాడసాగెను. అయినా కూడ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మంచిది. మరెవరైన సలహాలు ఇవ్వండి అని సలహాలు కోరసాగిరి. అప్పుడు ఔస్ తెగ నాయకులైన సఅద్ బిన్ ముఆజ్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఆకాంక్షను అర్థంచేసుకొని అన్సార్‌ల వైపు నుండి ప్రాతినిధ్యంను వహిస్తూ ఓ రసూలుల్లాహ్! బహుశా మీరు మా అభిప్రాయాలను తెలుసుకోవాలను కుంటున్నారు అని భావిస్తున్నాము. దేవుని ప్రమాణం! మేము మిమ్ములను సత్యవంతులుగా భావించాము. మిమ్ము విశ్వసించాము. మేము మా సర్వస్వమును మీకు అప్పగించాము. కావున మీరు మమ్ములను ఎక్కడికి తీసుకవెళ్ళిన తీసుకవెళ్ళుము. మేము మీతో వచ్చెదము. మిమ్ము సత్యంతో అవతరింపజేసిన ఆ దేవుని ప్రమాణం! ఒకవేళ మీరు మమ్ము సముద్రంలో  దూకమని ఆదేశించిన, క్షణం ఆలస్యం చేయకుండా దూకుతాము. మాలో ఏ ఒక్కరు కూడ ఈ విషయంలో వెనుకడుగు వేయరు. ఇన్షా అల్లాహ్ మీరు మా అందరిని యుద్ధంలో సహనం పాటించు వారిగా పొందెదరు. మీ కన్నులు సంతృప్తి చెందు వ్యవహారమును మీరు మాలో చూసెదరు అని తెల్పినారు. హుజూర్ (స) ఆ ఉపన్యాసమును విన్న తరువాత చాలా ఆనందించారు. ఆపై అల్లాహ్ పేరుతో ముందుకు వెళ్ళండి అని ఆదేశించారు. ఎందుకనగా అల్లాహ్ తాలా నాతో అవిశ్వాసులకు చెందిన రెండు బృందాలు ఎదురవుతాయని అనగా సైన్యం మరియు వ్యాపార బృందం. వాటిలో ఒకదానిపై మీకు తప్పక విజయంను చేకూర్చుతానని నాకు ముందుగానే తెల్పినాడు అని హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం శుభవార్త నందించారు. ఆపై హుజూర్ (స) ఇలా అన్నారు. దేవుని ప్రమాణం! శత్రువులు ప్రాణాలు కోల్పోయి క్రిందపడిపోవు స్థానాలను కూడ అల్లాహ్ తాలా నాకు చూపినాడు. చివరికి అలాగే జరిగింది. మొత్తానికి వారి ప్రస్తావన కొనసాగుతుంది. రాబోవు జుమా లో ఇన్షా అల్లాహ్ మిగిలిన అంశమును ప్రస్తావించెదను.

**అల్ హందులిల్లాహి నహ్మదుహు వనస్తఈనుహు వనస్తగ్ఫిరుహు వ నూమిను బిహి వన తవక్కలు అలైహి  వ నవూజు బిల్లాహి మిన్ షురూరి అన్ఫుసినా వమిన్ సయ్యిఆతి అఅమాలినా మన్ యహ్ది హిల్లాహు ఫలా ముజిల్ల లహు వమన్ యుజ్‌లిల్‌హు  ఫలా  హాదియ లహు వనష్హదు అన్ లా ఇలాహ ఇల్లల్లాహు వనష్ హదు అన్న ముహమ్మదన్  అబ్‌దుహు వ రసూలుహు. ఇబాదల్లాహి రహ్మకుముల్లాహి ఇన్నల్లాహ యఅమురు బిల్ అద్‌లి వల్ ఇహ్‌సాని వ ఇయితా ఇజిల్ ఖుర్బా వ యన్‌హా అనిల్ ఫహ్‌షాఇ వల్ మున్‌కరి వల్ బఘిఇ యఇజుకుం లఅల్లకుం తజక్కరూన్ ఉజ్‌కురుల్లాహ్ యజ్‌కురుకుం వద్‌వూ హు యస్తజిబ్‌లకుం వల జిక్‌రుల్లాహి అక్బర్.**

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

| From, | To, |
| --- | --- |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |
| ........................................ | ........................................ |